నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మెదక్

బుధవారం | 27 మార్చి 2024 | www.navatelangana.com

కాల్వ మట్టిని తొలగించేందుకు వెళ్లిన రైతులు



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలానికి తపాస్ పల్లి రిజర్వాయర్ ద్వారా వచ్చే సాగునీటి కాల్వపై మట్టితో వేసిన అడ్డు కట్టను తొలగించడానికి మండలంలోని పలు రైతులు మంగళవారం వెళ్లారు. ఈ విషయం తెలుసు కున్న కుకునూరుపల్లి పోలీసులు రైతులను అక్కడికి వెళ్లకుండా అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సమయంలో గొడవలు జరగవద్దనే ఉద్దేశంతో రైతులను పోలీస్ స్టేషన్ వద్ద ఉంచి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. తొగుట సిఐ లతీఫ్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. తొందరలోనే మట్టిని తొలగించి కొండపాక మండలానికి వచ్చే సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలపడంతో ఆందోళనకు తెర పడింది. రైతుల వెంట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు నీల సత్యం, ఐఎన్ టి యూ సి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ రవీందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్



నవతెలంగాణ-కంది

మండల కేంద్రంలోని కేశవరెడ్డి స్కూల్‌లో ఐదో తరగతి చదువు తున్న మహిత్ అనే విద్యార్థుడిని ఓ టీచర్ తీవ్రంగా చితకబాదాడు. ఈ ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని పట్నం మాణిక్యం, పట్నం రవితేజ దృష్టికి బాధిత విద్యార్థి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. దాంతో పట్నం మాణిక్యం యువసేన నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు సదరు స్కూల్‌కు చేరుకొని యజమాన్యాన్ని నిలదీశారు. ఇంకోసారి అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో పట్నం మాణిక్యం యువసేన నాయకులు, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై ఊరకుక్కల దాడి

నవతెలంగాణ-కౌడిపల్లి

రాత్రి ఆరు బయట నిద్రిస్తున్న వ్యక్తులపై అర్ధరాత్రి ఊర కుక్కలు ఇద్దరిపై దాడి చేశాయి. గ్రామస్తులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. కౌడిపల్లి మండలం నాగసాన్పల్లి గ్రామానికి చెందిన చెర్ల శంకరయ్య వేసవికాలం ఉక్కపోత కారణంగా తన ఇంటి వాకిట్లో నిద్రిస్తున్నాడు. రాత్రి 11 గంటల సమయంలో ఊర కుక్క అతనిపై దాడి చేయడంతో ముక్కును కరవడంతో ముక్కు భాగం ఎముకతో పాటు ఊడిపోయి కళ్ళ మాంసం ఊడిపోయింది. దీంతో అతన్ని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. సర్జరీ చేయాలని ఆస్పత్రి ఖర్చులకోసం రెండు లక్షల రూపాయలు వైద్యులు అడిగారని బాధితులు ఆందో ళన చెందారు. ఇదే గ్రామానికి చెందిన ఐదేళ్ల వయసుగల కుమ్మరి అర్జున్‌పై ఊర కుక్కలు దాడి చేసి గాయపరచడంతో కాలు, మొఖంపై తీవ్రంగా గాయాల య్యాయి. దీంతో నర్సాపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గత వారం రోజు లుగా తాండ, గ్రామంలో పలువురిపై ఊర కుక్కలు తీవ్రంగా గాయపరుస్తున్నా యని సంబంధిత అధికారులు ఊర కుక్కల భారీ నుంచి కాపాడాలని గ్రామస్తులు బాధితులు కోరుతున్నారు.

ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ సర్వీస్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



నవతెలంగాణ-పటాన్‌చెరు

పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో వేస్టేజ్ పరికరాలను రీసైక్లింగ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. పటాన్‌చెరు మండలంలోని పాశం మైలారం పారిశ్రామికవాడలో గల ఎన్విరో వేస్ట్ మేనేజ్మెంట్ సర్వీస్ పరిశ్రమలో మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో బయట నుంచి తీసుకువచ్చిన ఉపయోగం లేని వివిధ ప్లాస్టిక్‌కు సంబంధించిన వేస్టేజ్ పరికరాలను డంపింగ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ప్రమాదం చోటుచేసుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేయగా.. మంటలు అదుపులోకి రాలేదు. దాంతో మరో రెండు ఫైర్ ఇంజన్లను రప్పించి మూడు గంటల పాటు శ్రమించిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగ ప్రమాద సమయంలో పరిశ్రమ యజమాన్యం సంఘటన స్థలంలో అందుబాటులో లేకపోవడంతో ప్రమాద సంఘటనకు గల కారణాలు, ఆస్తి నష్టం తెలియాల్సి ఉంది.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సమస్యలతో బాధపడుచున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు నివ్వాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో, పరిపాలనాధికారి పరమేశానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రామ చందర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వివిధ సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయిలకు ఎన్నికల డ్యూటీ వేయడంతో.. చాలా సమస్యలతో సతమతమవుతూ విధులు నిర్వహించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చు తల్లులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, అంగ వైకల్యం, పిల్లల పెళ్లి తేదీలు ఎన్నికల తేదీకి దగ్గరున్నవారికి ఎన్నికల విధుల నుండి మినహాయింపనివ్వాలని,పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్‌లు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అసభ్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ పదో తరగతి పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా వ్యవహరించాడని సదరు విద్యార్థిని పరీక్షా విభాగం చీఫ్ సూపర్డెంట్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని పరీక్ష రాస్తున్న గదిలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ అసభ్యకరంగా వ్యవహరించడంతో పరీక్ష కూడా సరిగా రాయలేకపోయానని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఎస్ఎఫ్ఐ కూటమి విజయంతో సంబురాలు



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఢిల్లీ జేఎన్‌యూ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించినందుకు ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకుని టపాసులతో విజయోత్సవ సంబురాలు జరిపారు. ఈ సంబురాల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు మోషప్ప, రాజు, నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



నవతెలంగాణ- కొల్చారం

దాతల సహకారం అభినందనీయమని మండలంలోని అంసానిపల్లి గౌడ సంఘం సభ్యులు అన్నారు. గౌడ సంఘం సభ్యుల కోరిక మేరకు మంగళవారం గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద బీజేపీ రాష్ట్ర నాయకులు రఘువీర రెడ్డి, కార్యవర్గ సభ్యులు వాల్దాస్ మల్లేష్ గౌడ్‌లు సొంత ఖర్చులతో తమవంతు సహకారంగా రూ.1.26 లక్షలతో బోరు వేయించి, మోటార్‌ను బిగించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాభావంతో పనిచేస్తేనే సంతృప్తినిస్తుందని తెలిపారు. భక్తిభావంతో ప్రతి ఒక్కరూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు దయాకర్ గౌడ్, బూత్ అధ్యక్షులు రవీందర్ గౌడ్, నర్సాగౌడ్, యాదగౌడ్, చంద్ర గౌడ్, రామస్వామి గౌడ్, ప్రవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై నగదు పట్టివేత

నవతెలంగాణ-నంగునూరు

సిద్దిపేట-హన్మకొండ జాతీయ రహదారిపై ముంద్రాయి -వెంకటాపూర్ రోడ్డులో వాహనాల తనిఖీల్లో భాగంగా నంగునూరు మండలం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం రూ.2,33,900 నగదును సీజ్ చేశారు. నంగునూరు మండలం ఎఫ్.ఎస్.టి. (ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం) ఎంపీడీవో హరిప్రసాద్, హెడ్ కానిస్టేబల్ తిరుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు పర్శరాములు, రాజు, విధి నిర్వహణలో భాగంగా ముంద్రాయి, వెంకటాపూర్ రోడ్‌లో వాహనాలు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన రేసు బాలమల్లు కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ,2,33,900 నగదును తీసుకొని వెళుతుండగా సీజ్ చేశారు. ఆ డబ్బులను కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో డిపాజిట్ చేయడం జరుగుతుందన్నారు.ఆధారాలు చూపించి డబ్బులు రిలీజ్ చేయించుకోవచ్చని తెలిపారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు వల్లపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని మంగళవారం ఎఫ్డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పరామర్శించారు. ఇటీవలే శ్రీనివాస్ రెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి హైదరాబాదులో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆ కుటుంబానికి ప్రతాపరెడ్డి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చెలికాని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సజావుగా..

ఎన్నికల నిర్వహణ



- కట్టుదిట్టంగా కోడ్ అమలు
- రాజకీయ పార్టీల కదలికలపై నిఘా
- అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల్లో పహారా
- డయల్ 1950 టోల్‌ఫ్రీ...సువిధ యాప్
- నిరంతర సమీక్షలు.. నివేదికల తయారి
- అసెంబ్లీ ఎన్నికల మాదిరే పకడ్బందీ ఏర్పాట్లు

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహారిస్తోంది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా మెదక్ కలెక్టర్ రావురాజు నేతృత్వంలో ఎన్నికల ఏర్పాట్లు జరుగుతున్నాయి. 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, కోడ్ అమలు, రాజకీయ పార్టీల కదలికలు, నగదు, వస్తువుల రవాణా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సదుపాయాల కల్పన, బందోబస్తు ఏర్పాట్లు, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సమీక్షలతో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఏలాంటి చిన్న పొరపాటు కూడా జరగకుండా ఎన్నికలు సవ్యంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఏలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత పడుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసిన వెంటనే కోడ్ అమల్లోకి వచ్చినందున జహీరాబాద్, మెదక్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ కట్టుదిట్టంగా కోడ్ అమలవుతోంది. మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలోని దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, నర్సాపూర్, మెదక్, పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్, కామారెడ్డి, బాన్సువాడ, జక్కల్, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలు కోసం వివిద శాఖల అధికారులు నిరంతరం సమీక్షలు చేస్తూ ఎప్పటికప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో 36 లక్షల వరకు ఓటర్లున్నారు. ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు జాబితాలను విడుదల చేశారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల నిర్వహణపై చర్చిస్తున్నారు. నియోకజవర్గ ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ రిటరింగ్ అధికారులు, ఈవీఎం నోడల్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, అకౌంట్ టీం, ఎన్నికల ఖర్చుల పరిశీలనా అధికారులు, ట్రైనింగ్ నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఇలా వివిధ రకాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రాజకీయ పార్టీల కదలికలపై నిఘా..

ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచే కోడ్ అమల్లోకి వచ్చినందున మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ రాజకీయ పార్టీల కదలికలపై నిఘా పెట్టారు. జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులెవరైనా సరె ఎన్నికల అధికారుల అనుమతుల్లేకుండా ఏలాంటి పనులు చేయకూడదు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్‌కు తెలియ జేయడంతో పాటు పార్టీల కార్యక్రమాలను చిత్రీకరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచారాలు, కరపత్రాలు, పోస్టర్లు, ఆడియో క్యాసెట్లు, వాహనాలు, భోజనాలు, జెండాలు, తోరణాలు ఇలా ప్రతి పని చేయాలన్నా ముందస్తు అనుమతులు పొందాలి. అనుమతులు లేకుండా కార్యక్రమాలు చేస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘటన కింద కేసులు నమోదు చేస్తారు. మనుమతులు పొంది చేసే కార్యక్రమాలపై కూడా నిఘా పెట్టి ప్రతిదీ లెక్కిస్తారు. ఏప పనికి ఎంత ఖర్చు అవు తుందనేది ప్రత్యేక బృందాలు చూస్తాయి. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీలు ఆయా నియోజకవర్గాల్లో సన్నాహాక సమావేశాలు నిర్వహి స్తున్నాయి. ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నందున ఆ రోజు నుంచి మరింత సీరియస్‌గా కోడ అమలు కానుంది.



సరిహద్దుల్లో పహారా..

మెదక్, జహీరాబాద్ రెండు లోక్‌సభ నియోజ కవంగాలకు కూడా అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దులు న్నాయి. దీంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చెక్‌పోస్టు లు పెట్టారు. కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలు చెక్‌పోస్టుల వద్ద రాత్రింబవళ్లు పహారా కాస్తున్నాయి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున బంగారం, వెండి వంటి నగలతో పాటు నగదు తరలించే అవకాశముంది. అసెంబ్లీ ఎన్నికల్లో నోట్ల కట్టలు, బంగారం ఆభరణాలు పట్టుబడ్డాయి. దీంతో మరింత కట్టుదిట్టంగా సరిహద్దుల్లో తనిఖీలను పెంచారు. ఏలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, ఇతర ఆభరణాలేవైనా సరె తరలించడానికి వీల్లేదు. ఆధారాలు చూపకపోతే వాటిని సీజ్ చేస్తారు. నగదు, నగలతో పాటు పెద్దఎత్తున మద్యం, డ్రగ్స్ కూడా రవాణా అయ్యే ప్రమాదముంది. జహీరాబాద్ మీదుగా ఇతర రాష్ట్రాల నుంచి అక్ర వరవాణా జరిగే అవకాశమున్నందున అక్కడ నిఘాపెంచారు.

సి-విజిల్, 1950 టోల్‌ఫ్రీ...

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన సమాచారాన్ని తెలియజేసేందుకు సి-విజిల్ యాప్‌ను ఏర్పాటు చేశారు. స్థానికంగా కోడ్‌కు విరుద్ధంగా జరిగే కార్యక్రమాల సమాచారాన్ని యువత సి-విజల్ ద్వారా తెలియజేస్తే అధికారులు రంగంలోకి దిగుతారు. 24 గంటలూ పిర్యాదు స్వీకరించబడుతుంది. పిర్యాదు చేసిన వారి పేర్లను వెల్లడించరు. ఎవరైనా ప్లే స్టోర్ ద్వారా సి-విజల్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. అదే విధంగా 1950 టోల్ ఫ్రి నెంబర్‌ను కూడా ఏర్పాటు చేశారు. వివిద రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ప్రలోభాలు, నగదు, మద్యం, చీరలు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే 1950 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. ఇది 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది. పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, సభలు, వివిధ ప్రచార వాహనాలు, తాత్కాలిక పార్టీ కార్యాలయాలు, మైక్‌లు, లౌడ స్పీకర్లు, బారికేట్లు, హెలీప్యాడ్స్ వంటి అనుమతుల కోసం సుమిధా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అనుమతులు పొందేందుకు వీలుంది.

మార్గదర్శకాలు పాటించకుంటే అనుమతులు రద్దు

- ల్యాండ్ సర్వే రిపోర్ట్‌లో కాల్వ లేనట్లు చూపారు
- ఇరిగేషన్ అధికార్లు కాల్వను సర్వే చేయాలి
- రీజనల్ డిటిసిపి అధికారి వందనం
- సీపీఐ(ఎం) పార్టీ ఆందోళనతో కదిలిన యంత్రాంగం

నవతెలంగాణ-కొమురవెల్లి

గుగ్గిళ్ళ కుంట నుంచి మత్తడి నీళ్ల వెళ్లే కాల్వను రియల్ ఎస్టేట్ వ్యాపారి కనుమరుగు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఐనాపూర్ రెవెన్యూ పరిధిలో రసులాబాద్ గ్రామ శివారు సర్వేనం 258/ఎ1/3 లో విస్తీర్ణం 2.05 ఎకరాలకు వెంచర్ వేయడానికి డిటిసిపి అధికారుల నుంచి సదరు వ్యాపారి అనుమతులు పొందాడు. మత్తడి నీళ్ల కాల్వను సిమెంట్ పైపులు వేసి అండర్ గ్రౌండ్ చేసి పైన ప్లాట్లు వేయాలని పనులు ప్రారంభించాడు. కాల్వను కనుమరుగు చేస్తే పక్కన ఉన్న రైతుల పంట పొలాలకు నష్టం జరుగుతుందని ఇటీవల సీపీఐ(ఎం) పార్టీ మత్తడి కాల్వ వద్ద ఆందోళన చేశారు. ఆ అంశంపై పలు పత్రికలలో వార్తలు రావడంతో వెంటనే అధికార యంత్రాంగం కదిలింది. ఆందోళన నిర్వహించిన మరుసటి రోజే ఇరిగేషన్ ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి స్పందించి సిమెంట్ పైపులు వేయడానికి కట్టిన గోడను జేసీబీతో తొలగించారు. అందులో భాగంగానే మంగళవారం రీజనల్ డిటిసిపి అధికారి వందనం, రసులాబాద్ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్‌తో కలిసి వెంచర్‌లో ఉన్న మత్తడి నీళ్ల కాల్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతుల కోసం ఇచ్చిన ల్యాండ్ సర్వే పత్రాల్లో రెవెన్యూ ఏడి కాల్వ ఉన్నట్లు చూపించలేదని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే సర్వే చేసి కాల్వ భూమికి మార్కింగ్ చేయాలని, బఫర్ జోన్ ఉంటే గుర్తించి నివేదిక ఇవ్వాలని అడిగినట్లు చెప్పారు. వ్యాపారి డిటిసిపి మార్గదర్శకాలు పాటించకుంటే వెంటనే అనుమతులు రద్దు చేస్తామని తేల్చి చెప్పారు.





డీటీసీపీ అనుమతులను రద్దు చేయాలి..

- సీపీఐ(ఎం), బీజేపీ నాయకులు విజ్ఞప్తి

స్థానిక రైతుల పొలాలకు నష్టం జరుగుతున్నా అధికార్లు రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్‌కు అనుమతి ఇవ్వడాన్ని సీపీఐ(ఎం), బీజేపీ నాయకులు తప్పుపట్టారు. రెవెన్యూ ఏడి ద్వారా తప్పుడు నివేదికలతో పొందిన డిటిసిపి అనుమతుల్ని స్థానిక రైతులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



వృథాగా మిషన్ భగీరథ నీరు..

నవతెలంగాణ-మద్దూరు

వేసవికాలంలో ప్రజలకు తాగేందుకు నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రజలకు అందాల్సిన మిషన్ భగీరథ నీరు వృధాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దూలిమిట్ట, మండలంలోని బైరాన్‌పల్లి, బెక్కల్, గ్రామాల మధ్య జెనిగల వాగు వద్ద మిషన్ భగీరథ హెయిర్ గెట్ వాల్ నుంచి త్రాగునీరు వృధాగా పోతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాగేందుకు చుక్క నీరు లేకుండా ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని సంబంధిత అధికారులపై జిల్లాస్థాయి అధికారులు వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కంపోస్ట్ ఎరువును రైతులు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిద్దిపేట

మున్సిపల్ ఆధ్వర్యంలో అమ్ముతున్న కంపోస్ట్ ఎరువును రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కిలో పది రూపాయలకు అమ్ముతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి తెలిపారు. మందపల్లి రిసోర్స్ పార్కులో తయారుచేసిన 4060 కిలోల కంపోస్ట్ ఎరువును ఓ రైతు కొనుగోలు చేశాడని తెలిపారు. ఈ ఎరువు పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రసన్న రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ దిలీప్, రిసోర్స్ పార్క్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కీచక ప్రిన్సిపాల్

- మహిళ ఉద్యోగి పట్ల అసభ్యకర ప్రవర్తన
- లైంగికంగా వేధిస్తున్నాడని పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు



నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లా అందోల్ జోగిపేట మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా ఉద్యోగిని పట్ల కళాశాల ప్రిన్సిపాల్ అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత మహిళా ఉద్యోగిణి మంగళవారం జోగిపేట పోలీస్ స్టేషన్లో ఎస్సై అరుణ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేయడంతో.. విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు వీరమని తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కళాశాలలో 2015లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన వీరమని జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరింది. అయితే 2018లో ఆ కళాశాలలో శ్రీనివాస్‌లు సీనియర్ లెక్చరర్‌గా విధులు చేపట్టారు. 2020 నుంచి అదే కళాశాలలో ప్రిన్సిపల్‌గా శ్రీనివాస్‌లు బాధ్యతలు స్వీకరించారు. కాగా గత రెండేండ్లుగా ఏదో ఒక సాకుతో బాధితురాలిని శ్రీనివాస్‌లు మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేస్తూనే ఉన్నాడు. అక్కడ పనిచేయాలంటే తాను చెప్పినట్టు వినాల్సిందేనని.. మహిళా ఉద్యోగి నిల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. తనకు పర్సనల్‌గా కోపరేటివ్ చేస్తేనే అక్కడ పనిచేస్తావు.. లేదంటే లేదు అని బెదిరింపులకు గురిచేసేవాడని బాధితురాలు వాపోయింది. ప్రిన్సిపల్ వ్యవహార శైలిని ఇటీవలే ఆర్‌జెడీకి కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ ఆయనలో మార్పు రాలేదని తెలిపింది. తనను ఎలాగైనా ఉద్యోగంలో నుంచి తీసివేయాలనే అక్కసుతో తన పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్నాడని వాపోయింది. రెగ్యులర్ ఉద్యోగులు రావడంతో తనకు ఏ పనిచేయాలో చెప్పకుండా అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. సదరు ప్రిన్సిపాల్ కు తోటి ఉద్యోగులు సహకరించడంతో మరింత తనను తీవ్రంగా లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపించింది. గతంలో ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయిన జూనియర్ అసిస్టెంట్‌కు సంబంధించి డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని తనను ఇబ్బంది పెట్టారని, రెగ్యులర్ సూపర్డెంట్ ద్వారా తీసుకోవాలని తాను సూచించడంతో తనపై కక్ష సాధింపు చర్యలకు పాడుపడుతున్నాడని ఆమె తెలిపింది. పోలీసులు దర్యాప్తు జరిపి కీచక ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. కాగా సదరు ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

నేను ఎలాంటి తప్పు చేయలేదు

- శ్రీనివాసులు, ప్రిన్సిపల్

మహిళా ఉద్యోగిని పట్ల నేను ఎలాంటి తప్పు చేయలేదు. ఆమె చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం. నేను తప్పు చేసి ఉంటే డిపార్ట్మెంట్ వారు ఏచర్యలు తీసుకున్న అంగీకరిస్తా. ఔట్సోర్సింగ్ వారిని ఉద్యోగం నుంచి తీసివేస్తాంనే అభద్రతాభావంతోనే ఆమె ఇలాంటి చర్యలకు పూనుకున్నది.

డీఎస్పీ వద్దకు తీసుకువెళ్లిన పోలీసులు..

ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, బాధితురాలు వీరమనిలను వేరువేరుగా సంగారెడ్డి డీఎస్పీ కార్యాలయానికి పోలీసులు తీసుకువెళ్లారు. ఉదయం ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసిన బాధితురాలు ఈ విషయాన్ని స్థానిక ఎస్సై అరుణ్ కుమార్‌గౌడ్ డీఎస్పీ సత్తయ్య దృష్టికి తీసుకెళ్లడంతో వారిద్దరిని సంగారెడ్డికి తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దాంతో వారిని సంగారెడ్డికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

గొల్లపల్లి ప్రశాంత్ వర్ధంతి సందర్భంగా రక్తదాన కార్యక్రమం

- దు:ఖంలో ఉండి కూడా ఇతరులకు సాయపడలన్న ఆలోచన గొప్పది
- సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య

నవతెలంగాణ-సంగారెడ్డి

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు కుమారుడు ప్రశాంత్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మట్లాడుతూ.. గొల్లపల్లి ప్రశాంత్ గొప్ప భవిష్యత్తు ఉన్న యువకుడని.. చిన్నతనంలో మృతి చెందడం దురదృష్టమన్నారు. ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి ప్రయోజకుడు కావాలని కలలు కంటారాన్నరు. జయరాజు కుటుంబంలో జరిగిన రోడ్డు ప్రమాదం తమ కుమారుడిని వారి నుండి దూరం చేయడం బాధాకరమన్నారు. ఇంతటి దు:ఖంలో సైతం ఇతరులకు సేవ చేయాలన్న ఆలోచనలతో వర్ధంతిని పురస్కరించుకొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రోడ్డుపై డ్రైవింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, అతి వేగంతో వాహనాలు నడపకుడదని అన్నారు. ప్రశాంత్ స్నేహితులు ఇట్లాంటి మంచి కార్యక్రమానికి ముందుకు రావడం, స్నేహితుని మృతితో ఆ కుటుంబానికి బాసటగా నిలవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిండెంట్ అనిల్‌కుమార్, సీఐ భాస్కర్, ప్రజా సంఘాల నాయకులు మానిక్, యాదగిరి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రాజు, కుటుంబం సభ్యులు, స్నేహితులు తది తరులు పాల్గొన్నారు.



భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితం

నవతెలంగాణ-పటాన్‌చెరు

భారతదేశంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, వ్యవసాయ వర్గ సంబంధాలపై చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ మధుర స్వామినాథన్ అన్నారు. బెంగళూరులోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్, ఆర్థిక విశ్లేషణ విభాగాధిపతి అయిన ఆమె మంగళవారం 'సమకాలీన భారతదేశంలో వ్యవసాయ సంబంధాలు' అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ లోని సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె తమిళనాడులో గమనించిన మార్పులను ప్రస్తావిస్తూ, గ్రామీణ భారతదేశంలోని వ్యవసాయ సంబంధాల సంక్షిప్త స్వభావంపై ఉపన్యసించారు. మనదేశంలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ భూస్వాములు, రైతులు, వ్యవసాయ కార్మికులతో సహా వివిధ తరగతులను అర్థం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. స్థానిక వైవిధ్యాలను, చారిత్రక, ఆర్థిక పరిస్థితుల ప్రభావాన్ని గుర్తించాలన్నారు. గ్రామీణ రుణం, భూమి యాజమాన్యం, గ్రామీణ భారతంపై పెట్టుబడిదారీ విధానం వంటి సమస్యలను ఆమె వివరించారు.



అధ్యాపకులు, విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. ఈ సందర్భంగా, సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ రచించిన 'ట్రైబ్ క్లాస్ లింకేజ్: త్రిపురలోని రైతాంగ ఉద్యమ చరిత్ర, రాజకీయాలు' అనే పుస్తకాన్ని డాక్టర్ స్వామినాథన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకం త్రిపురలోని గిరిజన జనాభాలో వ్యవసాయ వర్గ సంబంధాల అభివృద్ధికి సంబంధించిన చారిత్రక అధ్యాయాన్ని వివరిస్తుంది. డాక్టర్ ఖాన్ తన పరిశోధనా ప్రయాణం, ఈ పుస్తకాన్ని రచించడంలో ఎదుర్కొన్న సవాళ్ళు, అనుభవాల ను ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పొలాల చుట్టూ విద్యుత్ కంచె వేస్తే జైలుకే



నవతెలంగాణ-కల్హేర్

పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం హెచ్చరించారు. మండల కేంద్రమైన కల్హేర్, రామ్‌రెడ్డి పేట గ్రామాల్లో రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంట పొలాలు, వ్యవసాయ క్షేత్రాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేస్తే.. అటువైపుగా వెళ్లే అడవి జంతువులు, పశువులు, మనుషులు కూడా కంచెకు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ కంచెను ఏర్పాటు చేయొద్దన్నారు. ఒకవేళ రహస్యంగా విద్యుత్ కంచెను ఏర్పాటు చేస్తే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గిరిధర్‌రెడ్డికి ఘన సన్మానం



నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ సంస్థ కార్పొరేషన్ చైర్మెన్‌గా నియామకం అయిన తర్వాత జహీరాబాద్‌కు విచ్చేసిన గిరిధర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆదర్శనగర్ కాలనీలోని గిరిధర్‌రెడ్డి స్వగృహంలో ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ కార్యకర్తలతో పాటు మొగుడంపల్లి ఎంపీపీ ప్రియాంక గుండారెడ్డి, జెడ్పీటీసీ రాందాస్, జహీరాబాద్ ఎంపీపీ ఉపాధ్యక్షులు, రాములు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోల్ల భాస్కర్, సంగారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షుడు యం.డి.ముల్తాని, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు అనేగుంట నాగిశెట్టి, జహీరాబాద్ మండల కో ఆప్షన్ మెంబర్ మోహినోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



జోగిపేటలో 5కే రన్

నవతెలంగాణ-జోగిపేట

ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జోగిపేటలో 5కే రన్ నిర్వహించారు. అందోల్ జోగిపేట ఆర్డీవో పాండు ఈ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భాస్కర్, కమిషనర్ తిరుపతి, ఎస్సై 2 మొగులయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీపీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన రంగవరం నరసమ్మ, అలాగే ఈదిగాని రాజు భార్య భూమిక ఇటీవలే మృతి చెందారు. ఈ విషయం తెల్సుకున్న ఎంపీపీ దమ్మగౌని రవీందర్ గౌడ్ మంగళవారం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరబోయిన నరేష్, యనగండ్ల నరేందర్ గౌడ్ ఎర్రవాలి ప్రవీణ్ ,రొయ్యపల్లి రవి, కోరబోయిన నర్సింలు, ఎర్రవాలి బాలు, మల్లేష్, యాదవ్, బాలయ్య బృందం పాల్గొన్నారు

ఆస్తిలో వాటా అడిగినందుకు చంపుతానని బెదిరింపులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



తమ పెద్దల నుంచి సంక్రమించిన భూమిలో తమ వాటాను అడిగినందుకు చంపుతానని ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడని బంగారుగళ్ల సుజాత అనే మహిళ వాపోయింది. ఈ మేరకు నెలరోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. మంగళవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 251, 252లో గల భూమి.. అనువంశికము ద్వారా తమకు చెందుతుందని తెలిపింది. తమ కుటుంబ పెద్దలైన బంగరుగళ్ల రామయ్య తండ్రి పోచయ్య నుంచి శంకరయ్య, జీతయ్య ఇద్దరు భాగస్తులుండగా.. తమ బాగం విభజన చేయకుండా జీతయ్య కుమారుడు రాజగోపాల్ అడ్డుపడుతున్నాడని ఆరోపించింది. అంతేకాకుండా రాజగోపాల్ గతంలో రెవెన్యూ ఆఫీసులో పనిచేసేటప్పుడు.. తనకు అనుకూలంగా రికార్డులు మార్పు చేశాడని.. దాంతో వారి పేరుమీదనే ధరణిలో వచ్చిందన్నారు. దీనిపై తాము కోర్టును కూడా ఆశ్రయించినట్టు చెప్పారు. చట్టానికి విరుద్ధంగా సదరు భూమిలో నిర్మాణ పనులు చేస్తున్నారని.. ఈ విషయమై ప్రశ్నించగా చంపేస్తానని రాజగోపాల్ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించింది. రాజగోపాల్‌తో పాటు వారి కుటుంబం తో తనకు ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించినట్టు చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేసి నెల రోజుల అవుతున్నా తమకు న్యాయం జరగలేదని మీడియా ఎదుట వాపోయింది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు తప్పవు



నవతెలంగాణ-న్యాల్‌కల్

లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే వారిపై కేసులు తప్పవని హద్నూర్ ఎస్ఐ రామునాయుడు హెచ్చరించారు. సోషల్ మీడియాలో గానీ, వాట్సాప్ ద్వారా తప్పుడు మెస్సెలు పోస్టు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బైండోవర్ చేసి.. లక్ష రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకొళ్లొద్దన్నారు. అంతకు మించితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కోడ్‌లో భాగంగా పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని 15 మందిని బైండోవర్ చేశామన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నిర్లక్ష్యం వొద్దు



నవతెలంగాణ-పుల్కల్

రోడ్డు నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహించకుండా.. నాణ్యతతో పనులు చేపట్టాలని పంచాయతీ రాజ్ ఏఈ శశికుమార్ సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. మంగళవారం నవతెలంగాణ దినపత్రికలో 'రోడ్లు వేశారు.. నీరు మరిచారు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందిస్తూ.. 90 శాతం మంది కాంట్రాక్టర్లు నాణ్యంగానే రోడ్లు వేసి.. 15 రోజుల పాటు నీరు కూడా పట్టారన్నారు. ఉమ్మడి మండలంలో కేవలం ఐదుశాతం మంది కాంట్రాక్టర్లే నిల్వ పట్టడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. ఇక ముందు అలా జరగకుండా చర్యలుఉ తీసుకుంటామన్నారు.

ప్రతీ విద్యార్థికి ప్రోత్సాహం తప్పక అవసరం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో మంగళవారం 6వ తరగతి నుంచి 8 వ తరగతి వరకు గల విద్యార్థులకు అచీవ్మెంట్ అవార్డుల పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఈ.కరుణాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఈ.అరుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఈ.విజయ కుమార్‌రెడ్డిలు సరస్వతీ మాత చిత్ర పటం ఎదుట జ్యోతి ప్రజ్వలన గావించి పటాన్ని పూలమాలతో అలంకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చదువులో, ఉత్తమ హాజరు శాతంలో, ఆటల పోటీల్లో, క్రమశిక్షణలో, ఎస్ఎస్‌సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారి నైపుణ్యాలను పరిగణలోనికి తీసుకుని ఈ అవార్డులు ప్రదానం చేసినట్టు చెప్పారు. ప్రతీ ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేస్తూ.. ఉత్తమ ఫలితాలను సృష్టిస్తున్నా రన్నారు. విద్యార్థులను ఇలా ప్రోత్సాహించడం వల్ల చదువులో కాకుండా అన్నిరంగాల్లో రాణిస్తారన్నారు. ప్రతీ విద్యార్థికి ప్రోత్సాహం తప్పక అవసరమన్నారు. ఈ కార్యక్రమం సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థల అధినేత సోలోమోన్ రెడ్డి ఆశీస్సులతో కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

- ఇంటి పర్మిషన్లు తీసుకొని వ్యాపార సముదాయాల నిర్మాణం
- ఆ సలహాలు ఇస్తున్నది అధికారులే ?
- టౌన్ ప్లానింగ్ అధికారులపై నిఘా పెట్టాలి
- స్థానికులు డిమాండ్

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్ల జిహెచ్ఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఎవరైనా వాటిపై ప్రశ్నిస్తే.. దానికి టాస్క్ ఫోర్స్ ఉందని సమాధానం చెప్పి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

కాగా జాతీయ రహదారిని ఆనుకోని ఈ మధ్యకాలంలో జోరుగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. అధికారులు వాటితో జేబులు నింపుకొట్టున్నారు తప్పా వాటిపై చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం అని అనుమతులు తీసుకుని.. వాటి స్థానంలో వ్యాపార సముదాయాలను నిర్మిస్తున్నారు. ఈ విషయం స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారికి తెలిసినా అటువైపు చూసిన పాపాన పోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇంటి అద్దెల కన్నా వ్యాపార సముదాయాలకు అద్దె ఎక్కువ వస్తుండడంతో.. చాలామంది వ్యాపార సముదాయాలనే



నిర్మిస్తున్నారు. అయితే వ్యాపార సముదాయాల అనుమతులకు నిబంధనలు ఎక్కువగా ఉండటంతో పాటు రుసుం లక్షల్లో కట్టాల్సి ఉంటుంది. దాంతో చాలామంది ఇంటికోసం అనుమతులు తీసుకుని.. వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో విస్తుపోయే విషయం ఏమంటే.. వాళ్లకు కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులే అలాంటి సలహాలు, సూచనలు ఇస్తున్నట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఒకే స్థలంలో రెండు మూడు ఇంటి అనుమతులు తీసుకొని దానిని ఒకటే వ్యాపార సముదాయంగా నిర్మిస్తున్నారు. బయట రంగులు వేసి లోపల జోరుగా నిర్మాణాలు చేపడుతున్నారు. రామచంద్రాపురం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో 3 వేర్వేరుగా ఇంటి పర్మిషన్లు తీసుకొని ఓ పెద్ద వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా.. చర్యలు మాత్రం తీసుకోవడం లేద



ని స్థానికులు చెబుతున్నారు.పత్రికల్లో వచ్చినపుడు మాత్రమే ఆగ మేఘాలమీద అధికారులు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. అంతేకాకుండా అందులో ప్రభుత్వ స్థలం కూడా కొంతమేర ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. అలాంటి నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్పా.. ఈ కట్టడాలు ఆగవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎవరైనా వాటిపై ఫిర్యాదు చేస్తే దానిని చూసుకునేందుకు టాస్క్‌ఫోర్స్ వస్తుందని సమాధానం చెబుతూ తప్పించుకుంటున్నారన్నారు. ఈ అక్రమ నిర్మాణం కారణంగా ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతున్నది. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు స్పందించి ఇలాంటి భవన నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి నిర్మాణాలను అరికట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూమ్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు అదనపు కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే.. కంట్రోల్ రూమ్ ఫోన్ నెం.08455 276155ని సంప్రదించాలన్నారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉన్నట్లయితే పౌరులు పై నెంబరుకు కాల్ చేసి సమస్య వివరాలు తెలిపితే.. ఆ సమస్యను సత్వరమే పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటారన్నారు. కాబట్టి జిల్లా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో గ్రూప్ 1,2,3,4, ఎస్సై, కానిస్టేబుల్ తదితర రాష్ట్ర స్థాయి ఉద్యోగాల కోసం ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కోర్స్ ద్వారా మూడు నెలల పాటు ఉచిత శిక్షణను అందజేస్తున్నట్టు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు టి.అఖిలేష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ఈనెల 28లోగా స్థానిక సమీకృత బాలుర వసతి గృహం హాస్టల్‌లో స్పాట్ అడ్మిషన్లు తీసుకొనునున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9440478004, 9849907051లను సంప్రదించాలన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ కుల, ఆదాయం, పదో తరగతి, డిగ్రీ, ఆధార్ కార్డ్,పాస్ ఫోటో సైజు ఫోటోలతో స్పాట్ అడ్మిషన్లుకు రావాలని సూచించారు.



చేపల వేటకు వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు

చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రేశం గ్రామానికి చెందిన బండి రాజేష్ (28) ఆదివారం మధ్యాహ్నం ఇంటి పక్కల ఉన్న సందీప్, మరికొందరితో కలిసి గ్రామంలోని చౌదరి చెరువులో చేపల వేటకు వెళ్లారు. చెరువులో వల వేస్తుండగా ప్రమాదవశాత్తు రాజేష్ నీటిలో మునిగిపోయాడు. దాంతో గజ ఈతగాళ్లతో రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం నీటిపై మృతదేహం తేలింది. దాంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, మూడేండ్ల బాబు, 11 రోజుల పాప ఉన్నారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిలువ నీడ లేదు..

- బొల్లారం మున్సిపాల్టీలో రోడ్లపైనే ప్రయాణికులు పడిగాపులు
- బస్టాండ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- బస్సు షెల్టర్ నిర్మాణంపై దృష్టి సారించని అధికారులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోడ్లపైనే బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొన్నది. మున్సిపాల్టీలోని ప్రధాన రహదారులు కూడళ్ల సముదాయాల్లో బస్సు షెల్టర్లు ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా అధికార యంత్రాంగం దృష్టి సారించడం లేదు.

బొల్లారం టౌన్‌లో నిత్యం జనసంచారం అధికంగా ఉంటోంది. అయితే వేసవి, వర్షాకాలంలో ప్రయాణికులు, పాదచారులు బస్ షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం దుకాణాలు ఇతర వ్యాపార సముదాయాల్లోకి పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక్కడి నుంచి అనేకమంది లింగంపల్లి, మియాపూర్, హౌసింగ్ బోర్డ్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు.



అంతేకాకుండా పాఠశాల, కళాశాల విద్యార్థులు, కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే సిబ్బంది వివిధ ప్రాంతాలకు వెళుంటారు. దాంతో నిత్యం సికింద్రాబాద్, కూకట్‌పల్లి, హౌసింగ్‌బోర్డ్, మియాపూర్ ప్రాంతాలకు బొల్లారం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్తుంటారు. అలాంటి వారందరూ బస్ షెల్టంలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉన్నప్పటికీ.. ఆ దిశగా చర్యలు మాత్రం తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. దానికి తోడు కొందరు రహదారి పక్కన గల స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దాంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాల్టీ అధికారులు, వివిధ పరిశ్రమ యాజమాన్యాలు స్పందించి బస్సు షెల్టర్‌లు నిర్మించాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు, కార్మికులు కోరుతున్నారు.

బస్ షెల్టర్‌లు నిర్మించాలి



బొల్లారంలోని ప్రయాణికులు, కార్మికులు, విద్యార్థులు బస్‌షెల్టర్‌లు లేక ఇబ్బందులు పడుతురు. వెంటనే మున్సిపల్ అధికారులు, పాలక వర్గం స్పందించి బస్సు షెల్టర్లు నిర్మించాలి.

-రాజయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పోలింగ్ సిబ్బంది మొదటి రాండమైజేషన్ పూర్తి

ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది మొదటి రాండమైజేషన్ పూర్తి చేసినట్టు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఎన్ఐసి, విసి హాల్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజెషన్ ప్రక్రియ నిర్వహించి పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులను పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 8363 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. అందులో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ



ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులున్నారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజా రాణి, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఐఓ-ఎన్ఐసిజి విద్యాసాగర్, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ క్షయ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు సంగారెడ్డి జిల్లాకు ఉత్తమ పురస్కారం అవార్డు లభించింది. స్థానిక డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ గాయత్రీ దేవి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. గాయత్రీ దేవి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అవార్డును జిల్లా సాధించినందుకు సిబ్బందిని అభినందించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసే క్షయ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. ఇంకా టీబి పరీక్షలను పెంచి ఏసిఎఫ్ క్యాంపులను కేసులను ముందస్తుగానే గుర్తించాలని సూచించారు. ప్రతి క్షయ రోగి కూడా పూర్తి కాలం చికిత్స తీసుకునే విధంగా చూడాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ జి.రాజేశ్వరి మాట్లాడుతూ.. 2023 సంవత్సరంలో జిల్లా సాధించిన లక్ష్యాలను వివరించారు. కలిసి ఉంటే కుటుంబ సభ్యులందరూ కూడా క్షయ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. వారికి క్షయవ్యాధి లేనిచో ముందస్తు జాగ్రత్త వారికి వ్యాధి వ్యాపించకుండా టీపీటీ మాత్రలను తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీబీ నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలను జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇబ్రహీం, భవ్య, ఎన్జీవో సభ్యులు జిల్లా క్షయ నివారణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భామని కుంటలో నిర్మాణాల అడ్డగింత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

గడ్డపోతారం గ్రామపంచాయతీ అల్లీనగర్ గ్రామంలో గల భామని కుంటలో కొన్ని పరిశ్రమ వర్గాలు చేపట్టిన నిర్మాణాలను గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. తమ భూములను పరిశ్రమలకు కేటాయించొద్దని డిమాండ్ చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. అల్లీనగర్ గ్రామంలోని సర్వే నెం 27లోని రైతుల నుంచి అసైన్డ్ భూమిని లాక్కొని కొన్ని పరిశ్రమలకు కేటయించారు. దాన్ని అదునుగా తీసుకని.. పారిశ్రామిక వర్గాలు భామని కుంటని కబ్జా చేస్తున్నాయి. కుంటలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాయి. ఇది గుర్తించిన గ్రామస్తులు సదరు నిర్మాణాలను మంగళవారం అడ్డుకున్నారు. ఇప్పటికే అల్లీనగర్ గ్రామంలో విపరీతమైన కాలుష్యంతో అవస్థలు పడుతున్నామని.. ఇకనైనా పరిశ్రమలకు ఈ భూములను కేటాయించొద్దని అధికారులను



కోరారు. పరిశ్రమల భూములు కేటాయించకపోతే..కాలుష్య తీవ్రత తగ్గుతుందని కోరారు. కావాలనే కొన్ని పరిశ్రమలు ఈ భూములపై కన్నేసి.. ఆక్రమించుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇకమీదటైనా రైతుల నుంచి భూములను గుంజుకుని.. పరిశ్రమలకు అప్పగించొద్దని విజ్ఞప్తి చేశారు.

అక్రమ మట్టి డంప్‌ను సీజ్ చేయాలి

- కాలువలు కబ్జా అవుతున్నా పట్టించుకోని అధికారులు
- మైనింగ్, తహసీల్దార్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎం.నర్సిములు

నవతెలంగాణ-కొండాపూర్

ఎలాంటి అనుమతి లేకుండా డంప్ చేసిన వందల ట్రిప్పుల ఎర్రమట్టిని మైనింగ్ అధికారులు సీజ్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నర్సిములు డిమాండ్ చేశారు. కొండాపూర్ మండలంలోని మన్సాన్‌పల్లి గ్రామ శివారులో గల 187, 188, 189 సర్వే నెంబర్లలో 27 ఎకరాల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఎలాంటి పర్మిషన్లు లేకుండా నిర్మాణాలు చేపడుతన్నారని ఆరోపించారు. పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువలను వెంచర్ యాజమాన్యం కబ్జా చేసి మట్టితో నింపారని ఆరోపించారు. కాబట్టి ఇరిగేషన్ అధికారులు వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల మరమ్మత్తులు చేసి రైతాంగానికి వర్షపు నీల్లు వెళ్లే విధంగా చూడాలన్నారు. వందల ట్రిప్పుల ఎర్రమట్టిని గుట్టల నుంచి తొలిచి వెంచర్లల్లో రోడ్లకు ఉపయోగించుకోవడం కోసం పెద్ద



ఎత్తున కుప్పలు వేశారని.. వెంటనే మైనింగ్ అధికారులు వెంచర్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని మట్టిని సీజ్ చేయాలన్నారు. అక్రమంగా వెంచర్లు వెలుస్తున్నా. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు ఎందుకు చూస్తూ ఊరుకుంటున్నారని ప్రశ్నించారు. మునిదేవునిపల్లి గ్రామంలోని 92 సర్వే నెంబర్ నుంచి ఎర్రమట్టిని తరలించి వెంచర్లలో రోడ్ల కోసం ఉపయోగిస్తున్నారని ఇది వెంటనే నిలిపేయాలన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన హార్వెస్టర్‌ను తీసుకెళ్తున్న డీసీఎం

హార్వెస్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



హార్వెస్టర్‌ను తీసుకెళ్తున్న డీసీఎం వాహనం జాతీయ రహదారిపై డివైడంను ఢీకొట్టడంతో హార్వెస్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నిజాంపేట్ మండల కేంద్రం జాతీయ రహదారి 161 పై జరిగింది. హార్వెస్టర్‌ను తీసుకెళ్తున్న డీసీఎం వాహనం నిజాంపేట్ నుంచి బచేపల్లి వైపు వేగంగా వెళుండగా.. డ్రైవర్ నిద్రమత్తుతో ఆర్‌హెచ్ఎస్ వైపు వెళ్ళి రోడ్డు డివైడర్ దాటి సైడ్ వాల్‌ను డి కొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం వాహనంలో హార్వెస్టర్ ముందు పడుకొని ఉన్న బళ్ళారి జిల్లా దురుర్ గ్రామానికి చెందిన సురుగుప్ప తాలూకా రాజాసాబ్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకుని ఘటనా స్థలాన్ని నారాయణఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎంఈఓ



నవతెలంగాణ-పుల్కల్

ఉమ్మడి మండలంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మండల విద్యాధికారి డి.అంజయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌటకూర్ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివంపేట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను పరిశీలించారు. ఐదో రోజున భౌతిక శాస్త్రం పరీక్షలు సజావుగా సాగాయన్నారు. 100కు 100శాతం విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారన్నారు. అనంతరం శివంపేట ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, ఎస్ఎల్ఎస్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు.

నవతెలంగాణ
మెదక్
బుధవారం | 27 మార్చి 2024 | www.navatelangana.com

మండల కేంద్రంలో అంబలి కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

హవేలి ఘనపూర్‌లో శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని సేవా సమితి జిల్లా అధ్యక్షులు సాయిబాబా ప్రారంభించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అంబలి సేవించడం వల్ల ఉపశమనం కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు బచ్చు జగదీష్, సతీష్, శ్రీపాల్, రాజశేఖర్, రామచంద్రం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌ఓసి అందజేత

నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి



నవ తెలంగాణ- కౌడిపల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినంక నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చులకోసం సీఎం సహాయ నిధి కింద అందజేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మహమ్మద్ నగర్ గ్రామానికి చెందిన అయ్యర్ వేదవతి ఆపరేషన్ నిమిత్తం లక్ష పదివేల చెక్క నర్సాపూర్ పార్టీ కార్యాలయంలో అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బురిగారి రఘు పటేల్, మంతూరి బాలా గౌడ్, చాకలి దుర్గయ్య, బురిగారి కృష్ణ, దర్జీ నగేష్, తో పాటు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు...

తెలంగాణ హక్కులను కాపాడటమే బీఆర్ఎస్ ఎజెండా

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రానికి అన్యాయం చేశాయి
- ఓటర్లను నట్టేట ముంచిన కాంగ్రెస్
- ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



నవతెలంగాణ-మెదక్

తెలంగాణ ఆత్మగౌరవాన్ని, హక్కులను కాపాడటమే ఎజెండాగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణకు ఎంతో అన్యాయం చేశాయన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని హామీ ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. బిజెపి నుంచి గెలిచిన నలుగురు ఎంపీలు పార్లమెంట్‌లో రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ఒక్క అంశం పై ఏనాడూ మాట్లాడిన పరిస్థితి లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ సిద్ధాంతంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. వేరే పార్టీలకు అనేకమైన ఎజెండాలు ఉండొచ్చు కానీ బీఆర్ఎస్‌కు మాత్రం తెలంగాణా ఆత్మగౌరవం, హక్కులను కాపాడటమే ఎజెండాగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ 14 ఏళ్ల పోరాడి సాధించుకొని పదేళ్ల పాటు సుపరిపాలన అందించి దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపారాన్నారు. కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శాశ్వత తాగునీటి, విద్యుత్ సమస్యలను దూరం చేశారని, గత ప్రభుత్వాలు వ్యవసాయాన్ని దండగ చేస్తే కేసీఆర్ పండగ చేసి చూపించారన్నారు. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో అన్నీ చేస్తామని చెప్పి ఓటర్లను నమ్మబలికి నట్టేట ముంచారని, రైతు భరోసా నుంచి పంటల బోనస్ వరకు అంతా బోగస్ అని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కరువు తాండవం చేస్తుందని, తాగు సాగు నీరు లేక పంటలు ఎండిపోతుంటే బాధిత రైతులను ఆదుకోవాల్సిన సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులను పెట్టి వేదించెందుకు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాత స్కీంలను పాతరేసి కొత్త స్కీం లకు కోత పెడుతుందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ది భూతుల పాలనే కాదు బూటకపు హామీల పాలన అనే విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలోకి తీసుకుంటూ సీఎం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పరిపాలన వైఫల్యం వలన రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రూ.15 వేల రైతు బంధు, రూ.4 వేల పింఛన్లు, మహిళలకు రూ.2500 పడే వాళ్ళు కాంగ్రెస్ కుఓటు వేయాలని పడని వాళ్ళు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. మహిళలు, రైతులు, పేదల బతుకులను కాంగ్రెస్ పార్టీ ఆగం చేసిందన్నారు. కరువు విలయ తాండవం చేస్తుందని, రాష్ట్రంలో 180 మంది రైతులు, 38 మంది ఆటో కార్మికులు చనిపోయారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ప్రజలు ముంచడం ఖాయమని, ప్రశ్నించే గొంతుకగా ఉన్న బీఆర్ఎస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి కంటారెడ్డి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి బుజ్జగింపులు

ఎమ్మెల్యే హరీష్ రావు, మెదక్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, ఎమ్మెల్యే సునీత రెడ్డిల మంతనాలు



నవతెలంగాణ-కౌడిపల్లి

నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న వార్తలు సోషల్ మీడియా, టీవీలలో ప్రచారం అయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డిలు కౌడిపల్లిలోని మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి స్వగృహానికి మంగళవారం మధ్యాహ్నం హుటాహుటిన తరలివచ్చి భేటీ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే సీటు ఇవ్వక పోయినప్పటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సన్నిహితుడైన మదన్ రెడ్డికి మెదక్ ఎంపీ టికెట్ ఇస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్ రావులు హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే పోటీ నుంచి తప్పుకొని ఎంపీ టికెట్ ఇస్తారన్న ఆశతో సునీతా రెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించిన మదన్ రెడ్డికి ఎంపీ టికెట్ కూడా దక్కలేదని పార్టీ కార్యకర్తలు నిరుత్సాహంతో ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో హైదరాబాదులోని ఓ విందు కార్యక్రమంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో ముచ్చటించిన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఫోటోలు సోషల్ మీడియాలో హల్చల్ కావడంతోపాటు మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న వార్తలు వచ్చాయి. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా మదన్ రెడ్డి ఇంటికి చేరుకొని 20 నిమిషాల పాటు ఆయనతో ఏకాంతంగా ముచ్చటించినట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లో పెద్దాయన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని వదులుకునే ప్రసక్తి లేదని హరీష్ రావు తెలిపినట్లు సమాచారం. ఇంతలో ఎమ్మెల్యే మదన్ రెడ్డిని గొంతు సరిగా రావడం లేదని హరీష్ రావు అడగడంతో మూడు రోజుల నుంచి గొంతు జలుబు వల్ల మాట్లాడటం ఇబ్బందిగా ఉందని అనడంతో మంచి ఆసుపత్రిలో చూసుకో పెద్దాయన అంటూ హరీష్ రావు ముచ్చటించారు.

పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి పూర్తి చేశారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ జిల్లాలోని 769 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 4,164 మంది ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. అందులో 1041 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1041 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2082 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నట్లు తెలిపారు. ప్రతీ టీంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు ఉంటారన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులు డ్రోన్ సదుపాయాన్ని వినియోగించుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి, శివ ప్రసాద్



నవతెలంగాణ-మర్కుక్

డ్రోన్‌తో వరి పొలాలలో మందు పిచికారి చేసి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్ రైతు వేదికలో వ్యవసాయ రంగంలో డ్రోన్ పాత్ర ఉపయోగాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ శిక్షణ పొందిన తర్వాత మాత్రమే పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. మధ్యాహ్నం పూట గాని అదేవిధంగా గాలి వేగం సెకండ్ కు 5 మీటర్ల ఎక్కువగా ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లో పిచికారి చేసుకోకూడదన్నారు. పొడిమందులు వాడినప్పుడు నాజిల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని హై టెన్షన్ వైర్లు ఎత్తయిన చెట్లు ఉన్నచోట జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ డ్రోన్ వాడకం కార్మిక వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఉత్పాదకతను పెంచుతుందన్నారు. సరైన సమయంలో సరైన మొత్తంలో పురుగుమందులను పిచికారీ చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించవచ్చన్నారు. ఇఫ్కో సంస్థ సిద్దిపేట వారు జిల్లాలోని 6 రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు దాదాపు రూ.16 లక్షల విలువగల డ్రోన్ వాహనాలను ఉచితంగా అందజేసినందుకు జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ పి వేణుగోపాల్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ అమరేష్, ఇఫ్కో జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు. మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, కొండపోచమ్మ ఎఫ్‌పీసి చైర్మన్ కొండల్ రెడ్డి, రైతులు తదితరులున్నారు.

ప్రశాతంగా పదో తరగతి పరీక్షలు : డీఈఓ రాధాకిషన్

నవతెలంగాణ-మెదక్ : మెదక్ జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.రాదాకిషన్ మంగళవారం తెలిపారు. జిల్లాలో 68 పరీక్షా కేంద్రాలలో 10300 మంది రెగ్యులర్ విద్యార్థులకుగాను 10279 మంది విద్యార్థులు మంగళవారం జరిగిన పరీక్షలు హాజరైనట్లు తెలిపారు. మిగితా 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే 38 మంది ప్రైవేట్ విద్యార్థులకుగాను 30 మంది హాజరయ్యారని, 08 విద్యార్తులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఇంటి ముందు పెట్టిన స్కూటీ దగ్ధం

నవ తెలంగాణ-నర్సాపూర్ : ప్రమాదవశత్తు స్కూటీ దగ్ధమైన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్ర రమేష్ అనే వ్యక్తి నర్సాపూర్‌లో తన పని ముగించుకొని ఇంటికి వచ్చి స్కూటీని ఇంటి ముందు పార్కు చేశాడు. అయితే రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు స్కూటీని రాత్రి రెండు గంటల ప్రాంతంలో తగలబెట్టారని ఆరోపించారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై. పుష్ప రాజ్ తెలిపారు.

జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ



నవతెలంగాణ-నార్సింగి

వివిధ రాష్ట్రాలలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల అనంతరం ఎన్నికలు సజావుగా జరపడానికి భద్రతలను కట్టుదిట్టం చేశారు. మండల పరిధిలోని జాతీయ రహదారి 44పై నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. జరగబోయే ఎన్నికలలో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా ఎన్నికలు సజావుగా జరపడానికి తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. రూ. 50 వేల పై చిలుకు డబ్బు తరలిస్తుంటే ఆ డబ్బుకు సంబంధించిన అన్ని ఆధార పత్రాలు వెంట ఉండాలని, లేనిచో ఆ డబ్బును జప్తు చేస్తామన్నారు. అక్రమంగా మద్యం తరలించినా, నిలువ ఉంచినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకూడదని, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రజలు స్వచ్ఛందంగా తమ నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఎక్కడైనా అక్రమ మద్యం, డబ్బు నిల్వ ఉంచినట్టు తెలిస్తే, ఓటర్‌లను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తే తమకు సమాచారం అందించాలని, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఆలయాల ప్రథమ వార్షికోత్సవం

మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మాధవానంద సరస్వతి స్వామి పూజలు



నవతెలంగాణ-కౌడిపల్లి

దాసాంజనేయస్వామి ఆలయం, పోచమ్మ దేవాలయం, రేణుక ఎల్లమ్మ దేవి ఆలయాల ప్రథమ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, సుజాతమ్మ దంపతులు సొంత ఖర్చులతో నిర్మించిన శ్రీ శివ పంచాయాతన, నవగ్రహ దేవత సమేత ఆలయంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దాసాంజనేయ స్వామి ఆలయంలో 14వేల తమలపాకులతో ఎమ్మెల్యే మదన్ రెడ్డి చతుర్థి పత్రార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గోపూజ, కుంకుమార్చన, పుష్పార్చన, హెూమం, ఇతర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్, వైస్ ఎంపీపీ నవీన్ కుమార్ గుప్తా, జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, మాజీ సి డి సి చైర్మన్ దుర్గారెడ్డి, మహమ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ చిన్నం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

పైతరలో ఘనంగా రథోత్సవం ఊరేగింపు

భక్తి శ్రద్ధలతో భక్తుల నీల్లసాకలు



నవతెలంగాణ-కొల్చారం

కొల్చారం మండలం పైతర గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున భ్రమరాంబిక మల్లికార్జున స్వామి రథోత్సవం ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. ఈ ఊరేగింపు లో బాగంగా ఆలయంలోని బ్రహ్మారాంబిక మల్లికార్జున స్వామి ఉత్సవ విగ్రహాలను రథోత్సవంపై ఉంచి గ్రామంలోని వీదులగుండా ఊరేగింపు చేస్తూ హరహర శంభో శంకర అంటూ భక్తులు శివుని నామస్మరణాలతో మార్మోగించారు. అడుగడుగునా భక్తులు రథోత్సవానికి నీల్లసాకలు చేస్తూ మొక్కలు చెల్లించుకున్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాల మధ్య శివసత్తుల పూనకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏళ్లుగారి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, నవీన్ చంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ చంద్రారెడ్డిలు, ఆలయ కమిటీ సభ్యులు పుట్టి చంద్రయ్య, మడబోయిన మల్లేశం, యాదవ రెడ్డి, వీరా రెడ్డి, బోయిని లచ్చయ్య, మిద్దె కిష్టయ్య కోరంపల్లి సత్తయ్య, తాటి మల్లేశం, కుమ్మరి భూమయ్య, శివకుమార్, పుట్టి శివ, కార్తిక్ రాజు, లక్ష్మీనారాయణ, శేఖర్, అంతయ్య అస్రఫ్, ఇబ్రహీం గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ యోగ పోటీలకు సిద్దిపేట యోగ క్రీడాకారులు



నవ తెలంగాణ - సిద్దిపేట

తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఈ నెల 29 నుంచి జరిగే నాల్గవ జాతీయ యోగా పోటీలకు సిద్దిపేట నుంచి ఇద్దరు యోగాక్రీడాకారులు ఎంపికయ్యారని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యోగాసనా భారత్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 31 వరకు పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో కడ్తాల్, హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పల్లె సురేష్ బాబు , చిప్ప ప్రభాకర్ లు తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ యోగ క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. 45 నుంచి 55 సంవత్సరాల విభాగంలో ఎంపికయ్యారన్నారు. జాతీయ యోగా పోటీలకు సురేష్ , ప్రభాకర్‌లు ఎంపికైనందుకు సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, గౌరవాధ్యక్షులు కే.అంజయ్య, ఉపాధ్యక్షులు విక్రమ్ రెడ్డి, హరిప్రసాద్, తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనంకపాకర్, యోగ శిక్షకులు తోటసతీష్. సంధ్యలు హర్షం వ్యక్తంచేశారు. సిద్దిపేట కీర్తి పతాకను జాతీయస్థాయిలో ఎగరవేయాలని ఆకాంక్షించారు.

డబుల్ బెడ్ రూమ్‌పై నుంచి కిందపడి బాలుడు మృతి



నవతెలంగాణ -నంగునూరు

డబుల్ బెడ్ రూమ్ స్లాబు పైన తోటి స్నేహితులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి బాలుడు మృతి చెందిన సంఘటన నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సత్తార్ కుమారుడైన అబ్దుల్ రెహమాన్ (11)డబుల్ బెడ్ రూమ్ స్లాబుపై ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతనిని హుటాహుటిన సిద్దిపేట ఆసుపత్రికి కారులో తరలిస్తున్న క్రమంలో మిట్టపల్లి వద్దకు రాగానే 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స చేసిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

మృతుల కుటుంబాలకి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని గణేష్ పల్లి గ్రామానికి చెందిన వడ్ల ఆంజనేయులు, చీకోటి కిష్టయ్య లు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మంగళవారం బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షుడు సాయిరెడ్డి రామిరెడ్డి, మాజీ అధ్యక్షుడు రమేష్ గుప్తలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రు.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్, మండల బీజేవైఎం ప్రధాన కార్యదర్శి కొండ బాలకష్ణ, కుంట సత్యం, పుట్ట నాగార్జున, పుట్ట అమర్, బొగ్గుల బాలరాజ్, బొగ్గుల స్వామి, రెడ్డి వెంకట్ రెడ్డి. కొంతం శీను, దేశమైన రామాంజనేయులు,పెద్ద గిల్క కృష్ణలు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన గౌడ సంఘం ప్రతినిధులు



నవ తెలంగాణ-కొమురవెల్లి

రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని స్వగృహంలో కొమురవెల్లి మండల గౌడ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి గౌడ్, మాజీ ఎంపీటీసీ ముత్యం లక్ష్మయ్యగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు ముత్యం నర్సింలు గౌడ్, బూడిగే గురువయ్య గౌడ్, దొడ్ల బిక్షపతిగౌడ్, దొమ్మాట సత్తయ్య గౌడ్, మారగోని బిక్షపతి గౌడ్, ముత్యం ఉప్పలయ్య గౌడ్, ముత్యం పర్శరాములు గౌడ్, ముత్యం యాదగిరి గౌడ్, ముత్యం నాగరాజు గౌడ్, ముత్యం నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులుగా భాస్కర్, రంజిత్ రెడ్డి





నవతెలంగాణ-చేర్యాల

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చేర్యాల డివిజన్ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా సుద్దాల భాస్కర్ ఆముదాల రంజిత్ రెడ్డితో పాటు కమిటీని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చొప్పరి రవికుమార్ మంగళవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా అత్తిని హారిక,తాడూరి భరత్, సహాయక కార్యదర్సులుగా పుర్మ రాకేష్ రెడ్డి,నాగపురి కిరణ్ ఎన్నికయ్యారు. అనంతరం ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ డివిజన్‌లో విద్యారంగ సమస్యలు అనేకం ఉన్నాయని, చేర్యాల పట్టణ కేంద్రంలో ప్రభుత్వ పీజీ కళాశాల, ఎస్సీ హాస్టల్‌కు స్వంత భవనం, చేర్యాల పట్టణ శివారులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణానికి తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ఫీజుల దోపిడిని అరికట్టాలని, కొమురవెల్లి, దూలిమిట్ట మండల కేంద్రాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఆదివారం జరిగిన మహాసభలో తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు.

దొంగతనం చేసిన వ్యక్తికి రిమాండ్

నవతెలంగాణ-మద్దూరు : దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఫిబ్రవరి 28న దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ముక్క కనకయ్య ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువా పగలగొట్టి దొంగతనం చేశారని తెలిపారు. ముక్క కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన పాత నేరస్తుడు ముక్క రమేష్‌పై అనుమానంతో విచారించగా అతను ముక్క కనకయ్య ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దొంగతనానికి పాల్పడిన అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ కేసులు సరికాదు



నవ తెలంగాణ-సిద్దిపేట

ఇళ్ల రోడ్డు కబ్జా ను అడ్డుకున్న వడ్డెర కులస్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం సరికాదని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు తిరుపతి అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీ సర్వేనెంబర్ 1340 లోని 32 ఇళ్లకు ఉన్న రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేపడితే అడ్డుకున్నామని, ఎవరిని దూషించలేదని తెలిపారు. తమ ఇండ్ల పైకి వచ్చి దాడి చేశారని, మహిళలు చిన్న పిల్లలని చూడకుండా ఇష్ట రీతిగా దూషించారని ఆరోపించారు. అక్రమ నిర్మాణం అడ్డుకుంటే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతారా అని ప్రశ్నించారు. సంబంధిత డిపార్టుమెంట్‌ల అధికారులు స్పందించి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మల్లేశం, రవి, స్వామి, రాజు, నరసింహులు, శ్రీనివాస్, నర్సింలు, చందు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

నవ తెలంగాణ-దుబ్బాక

పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ తెలిపారు. మంగళవారం జరిగిన భౌతిక, రసాయన శాస్త్ర పరీక్షకు దుబ్బాక పురపాలిక పరిధిలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 814 మంది విద్యార్థులకు 813 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారని, అక్బర్ పేట, భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో 107 మంది విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలలో జిల్లా విద్యాధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేసి పరీక్షలు కొనసాగుతున్న తీరును పరిశీలించారు.

నర్సారెడ్డిని విమర్శించే నైతిక హక్కు ప్రతాప్ రెడ్డికి లేదు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డమీడి రాములు గౌడ్



నవతెలంగాణ-వర్గల్

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని మాజీ ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించే నైతిక హక్కు లేదని తునికి ఖల్సా గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డమీడి రాములు అన్నారు. మంగళవారం తునికిఖల్సాలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉన్న నర్సారెడ్డిని విమర్శించడం సరికాదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వకపోతే రాజీనామా చేసి పోటీ చేసి వుంటే గజ్వేల్ ప్రజలు తనను స్వాగతించేవారన్నారు. ఇప్పటికైనా ఇతరులను విమర్శించడం మానుకోవాలన్నారు. లేకపోతే తన రాజకీయ భవిష్యత్ కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో గంగుమల్ల శ్రీనివాస్ రెడ్డి, వాంకార్ ఆనంద్, తునికి ఖల్సా ఎంపీటీసీ జనార్ధన్, కోండల్ రెడ్డి, గుడ్ల శ్రీహరి గౌడ్, సాయి కిరణ్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, నాగభూషణం, గొడుగు అంజయ్య, పంజాల సాయి గౌడ్, నర్సగల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో యజ్ఞంలా గోటి తలంబ్రాలు



నవ తెలంగాణ- గజ్వేల్ : శ్రీరామనవమికి భద్రాచలంలో జరిగే కల్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలు మాత్రమే ఉపయోగించాలని విశ్రాంత మండల విద్యాధికారి సుభేందర్ అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవాసంస్థ గోటి తలంబ్రాలకు శ్రీకారం చుట్టింది. భద్రాచల దేవస్థానం అందించిన 150కిలోల ఒడ్లను ఒలిపించి అందించే బాధ్యత సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజుకు అప్పగించింది. రామ నామమే ప్రాణంగా భావించిన రామకోటి రామరాజు గ్రామ గ్రామాన తిరిగి భక్తులందరిని ఏకంచేసి గృహాల్లో, దేవాలయాల్లో సామూహికంగా భక్తులచే రామనామం జపిస్తూ గోటితో ఒడ్లను ఒలిచి తలంబ్రాలుగా తయారు చేస్తున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కులమతాలకతీతంగా, రాజకీయాలకతీతంగా, చిన్న,పెద్ద అందరూ పాల్గొంటున్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ- గజ్వేల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకుడు జస్వంత్ రెడ్డి ఇంట్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రుణమాఫీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు ఉప్పల మధుసుదన్, మండల ప్రధానకార్యదర్శి వాంజరి రాజు, బీజెవైయం మండల అధ్యక్షుడు నవీన్, ఓబీసీ మండల అధ్యక్షుడు కుమార్ గౌడ్, మండల కార్యదర్శి బీం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-సిద్దిపేట

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 29న పొన్నాల వద్దగల బీఆర్ఎస్ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని మాజీ ప్రజాప్రతినిధులు రాజనర్సు, రవీందర్ రెడ్డి, సాయిరాంలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి ఉమ్మడి జిల్లాలో ప్రజలందరికీ సుపరిచితుడన్నారు. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలనలో ఇచ్చిన మాటలన్నీ తప్పిందన్నారు. వెంకట్రాంరెడ్డి గెలుపు తధ్యమన్నారు. 29న జరిగే సమావేశానికి ఎమ్మెల్యే హరీష్ రావు, అభ్యర్థి వెంకటరామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మొహిజ్, వజీర్, శ్రీకాంత్ రెడ్డి, మోహన్ లాల్, రెడ్డి ప్రభాకర్ రెడ్డి, మహేష్, ఎల్లారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి సల్కం మల్లేష్ దాతృత్వం



నవతెలంగాణ- దుబ్బాక

పేద యువతి వివాహానికి అండగా నిలిచి తన దాతృత్వాన్ని చాటుకున్నారు కాంగ్రెస్ జిల్లా నాయకులు సల్కం మల్లేష్ యాదవ్. మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని పోతారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కోమటి దేవవ్వ- భూమయ్య దంపతుల కుమార్తె వివాహానికి ఆయన పుస్తే మట్టెలను అందజేశారు.కాంగ్రెస్ పోతారం గ్రామాధ్యక్షుడు రమేష్ రెడ్డి,కిసాన్ సెల్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, కేశవరెడ్డి,రాజు పలువురున్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు

- యధేచ్ఛగా వ్యాపారం
- పట్టించుకోని రెవిన్యూ అధికారులు







నవతెలంగాణ-కొమురవెల్లి

ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా అక్రమ వ్యాపారానికి తెర లేపారు. మండలంలోని తపస్ పల్లి గ్రామంలో సర్వే నంబర్ 93లో 136 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న కొందరు అక్రమార్కులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా బండరాళ్లను బ్లాస్టింగ్ చేస్తూ భూముల ఫెన్సింగ్ ఉపయోగించే కనీలు, ఇంటి నిర్మాణాలకు కంకర, గనెట్ రాళ్ల వ్యాపారాన్ని కొనసాగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించి భారీ వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తాయి.

రాళ్లు తీసిన భూమి అక్రమణ

బండరాళ్లు తీసిన భూమిని అక్రమార్కులు చదును చేసి అక్రమంగా వ్యవసాయం చేస్తున్నారు. సుమారు 15 ఎకరాల వరకు సాగు చేస్తున్నట్టు సమాచారం. 93 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో కొందరు కొద్ది భూమికి అసైన్మెంట్ పట్టా పొంది పక్కన ఉన్న భూమిలో బండరాలను తొలగిస్తూ అక్రమ వ్యాపారాన్ని చేస్తూ చదునైన భూమిని తన భూమిలో కలుపుకొని ఆక్రమించుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అక్రమణ దారులపై కొందరు యువకులు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో వాళ్లను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అక్కడకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని స్థానికంగా ఆరోపణలు వస్తున్నాయి.

ఫిర్యాదులు వచ్చాయి చర్యలు తీసుకుంటాం

తహశీల్దార్ లక్ష్మీనారాయణ

ప్రభుత్వ భూమిలో బ్లాస్టింగ్ జరుగుతూ అక్రమ వ్యాపారం చేస్తున్నారని భూమిని చదును చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ జరిపి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాము.

టోల్ ప్లాజా సెక్యూరిటీని ఢీకొట్టిన బస్సు

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం దుద్దెడ శివారులోని టోల్ ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. దుద్దెడ టోల్ ప్లాజాలో విధులు నిర్వహిస్తున్న రాజ బాబును సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిద్దిపేట డిపో ఆర్టీసీ బస్సు అతివేగంగా వెళుతూ అదుపుతప్పి ఢీకొట్టింది. దాంతో రాజబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కరెంటు షాక్ తగిలి పాడి గేదె మృతి



నవతెలంగాణ-దుబ్బాక

కరెంటు షాక్ తగిలి పాడి గేదె మృతి చెందిన ఘటన దుబ్బాక పురపాలిక కేంద్రంలో మంగళవారం జరిగింది.బాధిత రైతు మల్లుగారి అనిల్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లుగారి అనిల్ రెడ్డికి చెందిన పాడి గేదె మంగళవారం ఉదయం తనకున్న వ్యవసాయ పొలం వెళ్లే దారిలోనున్న ట్రాన్స్ఫార్మర్ వద్ద గడ్డి మేస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.60 వేల విలువగల పాడి గేదె మృతి చెందడం వల్ల తనకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రుణమాఫీ మాఫీ చేయాలని బీజేపీ నాయకులు బండారు మహేష్, పంజాల అశోక్ గౌడ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలన్నారు. రైతులు రుణం కట్టకపోవడంతో గజ్వేల్ నియోజకవర్గంలో బ్యాంకు అధికారులు వారి ఇంటి చుట్టూ తిరుగుతూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రుణం వెంటనే కట్టకపోతే వారి ఇండ్లకు తాళాలు వేస్తామని రైతులను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మాయలపకీరు మాటలతో నమ్మించి రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకు మాట నెరవేర్చుకోలేదని ఎద్దేవా చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో పంట పొలాలు కరెంటు లేకపోవడంతో పూర్తిగా ఎండిపోతున్నాయన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఉప్పల మధుసుదన్ సిల్వేరు జనార్దన్ నాయకులు వాంజరి రాజు నరసింహ చారి నరేష్ వెంకటేష్ శ్రీకాంత్ నవీన్ శ్రీనివాస్ సతీష్ కుమార్ గౌడ్ షణ్ముఖ బీం కుమర్ రేక్షి గౌడ స్వామి సంతోష్ దయానంద్ షరత్ రవి మణికంఠ షరత్ తదితరులు పాల్గొన్నారు...

దేశ్ పాండే స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం





నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఇంగ్లీషు భాషా నైపుణ్యాలను పెంపొందించడంలో దేశ్ పాండే స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ అన్నారు. దేశ్‌పాండే స్వచ్ఛంద సంస్థ నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో స్వయంగా తయారు చేయబడిన బోధనోపకరణాల స్టాళ్లను రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా దేశ్ పాండే స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో స్కిల్ ఇన్ విలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆంగ్లభాష పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో విశేష కృషి చేస్తున్నారని వారి సేవలు అమోఘమని కొనియాడారు. దేశ్ పాండే సంస్థ క్లస్టర్ కోఆర్డినేటర్ అనుపమ మాట్లాడుతూ దేశ్ పాండే సంస్థ అందిస్తున్న సేవలను ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు వినియోగించుకొని తమ భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కోరారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు కల్లాటి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ్ పాండే ఫౌండేషన్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు అందరూ శ్రద్ధగా నేర్చుకొని ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రాడ్యుయేషన్‌డే భాగంగా విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోజు సీతారాములు, గడీల శ్రీకాంత్ , చిలువేరు పద్మ,పెద్ది శారద, దేశ్ పాండే స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యాయులు శిల్ప, చంద్రకళ, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలి





నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

లోక్ సభ ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల నిబంధనలను అనుసరిస్తూ లోక్ సభ ఎన్నికలు 2024 పోలింగ్ సిబ్బందితో మంగళవారం మొదటి విడత ర్యాండమైజెషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఇతర పోలింగ్ అధికారులు, 1009 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 4940 మందిని మొదటి విడతలో ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. అందులో 1235 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1235మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2470 మంది ఇతర పోలింగ్ అధికారులున్నారు. ప్రతి టీములో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు ఆధార్ పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి ఆయా శాఖల ద్వారా సమాచారం అందించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రెహమాన్, ఈడీఎం ఆనంద్ పాల్గొన్నారు.

కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్



నవతెలంగాణ-గజ్వేల్: కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం డిప్యూటి లేబర్ కమిషనర్ రవీందర్ రెడ్డికి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్ మెంట్ 1948 కనీస వేతనాల చట్టం ఆధారంగా కనీస వేతనాలను నిర్ణయిస్తూ 2024 జనవరి 29 వ తేదిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ నిర్ణయించిందన్నారు. కార్మికుల కడుపులు కొట్టి యజమానుల బొజ్జలు నింపేదిగా ఉన్నదన్నారు. కార్మికుల కనీస అవసరాలను కూడా పరిగణలోకి తీసుకోలేదని, కార్మిక సంఘాల డిమాండ్‌ను పక్కకు పెట్టిందన్నారు. సలహా మండలి సూచనలు పాటించాలన్నారు. గతంలో చేసిన సూచనలను పట్టించుకోలేదని. జారీ చేసిన నోటిఫికేషన్ పై మళ్లీ పరిశీలన జరిపి కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రోజుకు కనీసం 2700 క్యాలరీల శక్తినిచ్చే ఆహారం కార్మికుడు తీసుకోవాలని, కనీస వేతనంలో కుటుంబం లో భర్త భార్య ఇద్దరు పిల్లలు మూడు వినియోగ యూనిట్లకు ప్రతి యూనిట్‌కు 18 గజాల చొప్పున 72 గజాల దుస్తులు, 10 శాతం ఇంటి అద్దె, కనీస వేతనాలపై 20 శాతం ఇంధన విద్యుత్ ఖర్చు ఉండాలని, 1992 సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్ర కోస్ బ్రెట్ కేసులో 25% అదనంగా విద్య వైద్య ఇతర ఖర్చులు కలిపి కనీస వేతనం నిర్ణయించాలని చెప్పిందన్నారు. చట్టబద్ధంగా శాస్త్రీయంగా కనీస వేతనాలు నిర్ణయించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, శాస్త్రీయంగా లెక్కిస్తే పెరిగిన ధరల ఆధారంగా నేడు నెలకు రూ,28000 ఆదాయం ఉంటేనే కార్మిక కుటుంబం బ్రతుకుతుందన్నారు. మన రాష్ట్రంలో ఈ విధానం అమలు చేయకుండా కార్మికులకు అన్యాయం చేసే విధంగా జీవోలు ఉన్నాయని పెరిగిన ధరలకు అనుగుణంగా జీవోలను సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, సద్దాం, నరేష్ పాల్గొన్నారు.

శంభూగిరి సిగలో మరో ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం

- శ్రీ విద్యాధరి క్షేత్ర సముదాయంలో శ్రీ చంద్రమౌళీశ్వర విగ్రహ ప్రతిష్ట



నవతెలంగాణ-వర్గల్

తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం, ఆధ్యాత్మిక కేంద్రంగా వెలిసిల్లుతున్న వర్గల్ శ్రీ విద్యాధరి ఆలయ సముదాయంలో మరో క్షేత్ర నిర్మాణానికి ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య మంగళవారం అంకురార్పణ చేశారు. ఎంతో మహత్యం కలిగిన, ఆధ్యాత్మిక సంపన్నులు పుణ్యపాదంతో పునీతమైన శంభూగిరి సిగలో శ్రీ పరివార సమేత చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి శ్రీ క్షేత్రం పీఠాధిపతి శ్రీ మధుసూదనానంద స్వామీజీ పర్యవేక్షణలో శ్రీకారం చుట్టగా, అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, దీక్షాధారణం, రుత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, శాలాసంస్కారం, వాస్తు, యోగిని, క్షేత్రపాలక నవగ్రహ, సర్వతోభద్ర, లింగతోభద్ర మంటపదేవతా అవాహన ఉపచార పూజలు, వాస్తు పర్యగ్నికరణం, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ట, అవాహిత దేవతా హవనములు, జలాధివాసము, నీరాజనం, మంత్రపుష్పము తదితర కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు విశేష సంఖ్యలో తరలిరాగా, లోక కళ్యాణార్థం శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ మహా పుణ్య కార్యంలో శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ పాల్గొననున్నట్లు స్పష్టం చేశారు. కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి ఆశీస్సులతో బ్రహ్మశ్రీ తాటిపాముల నరసింహమూర్తి, బ్రహ్మశ్రీ తీగవరపు బాల ఉమామహేశ్వర శర్మ వైదిక నిర్వహణలో ఈ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తుండగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన వివరించారు.

కబ్జాకోరు, భూ దొంగ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

- త్వరలోనే తీహార్ జైలుకు వెళ్లడం ఖాయం
- చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కబ్జాకోరు, భూ దొంగ అని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో రూ.100 కోట్లు పంచిపెట్టాడని త్వరలోనే ఆయన అక్రమాలపై విచారణ చేపట్టి తీహార్ జైలుకు పంపడం ఖాయమన్నారు. మంగళవారం దుబ్బాక మండల పరిధిలోని సిఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ళుగా నిస్వార్థంగా నీతివంతంగా ప్రజా సేవ చేసిన కుటుంబం తమదని నొక్కి చెప్పారు. గెలిచి నాలుగు నెలలు కావస్తున్నా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి దుబ్బాకకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.కోడి కత్తి డ్రామా, డబ్బులు పంచడం ద్వారా గెలిచిన ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డికి దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన భూ కబ్జాలపై ఇటీవలే ఓ ఛానల్లో వార్తలు వచ్చాయని గుర్తు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి ప్రభాకర్ రెడ్డి తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. త్వరలోనే కొత్త ప్రభాకర్ రెడ్డి తీహార్ జైలుకు పోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు అనంతుల శ్రీనివాస్, కొంగర రవి, ఏసు రెడ్డి కడుదురి నరేందర్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, మచ్చ శ్రీనివాస్,సల్కం మల్లేష్ యాదవ్,పాతూరి వెంకటస్వామి గౌడ్, ఆకుల భరత్,మంద శ్రీనివాస్, ఉషయ్యగారి రాజిరెడ్డి, కరాటే శ్రీకాంత్, మాజీ సర్పంచ్ లు, పలువురు నాయకులు,కార్యకర్తలున్నారు.

27న డీబీఎఫ్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

- డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ -రాయపోల్ : అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం పురస్కరించుకొని భారత రాజ్యాంగం, హక్కులు, చట్టాలు,సంక్షేమం పథకాలు, నాయకత్వ లక్షణాల పై దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం అనాజిపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు రాష్ట్ర సదస్సు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం, భారత రాజ్యాంగం, హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలు,నాయకత్వ లక్షణాల పై బుధవారం 27-03-2024 ఉదయం 11:00 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ను ఆధార్ కార్డు లింక్ ను ఉపసంహరించుకోవాలని పాత విధానాన్ని కొనసాగించాలని,అలాగే మూడు నెలల నుండి ఎర్రటి ఎండలో పనిచేస్తున్న కూలీలకు ఇంత వరకు కూలీల డబ్బులు రాలేవన్నారు. బుధవారం జరగబోయే ఈ సదస్సుకు ఉపాధి హామీ కూలీలు, మహిళ నాయకురాలు, మహిళ ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో అనాజిపూర్ ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి సేవ చేసిన వారిని గుర్తించాలి

- మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ పార్టీలో సేవ చేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో 10 సంవత్సరాలుగా పనిచేస్తున్నామన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కోసం పని చేశామని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున సీనియర్ కార్యకర్తలను నాయకులను గుర్తించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగిరేల చూస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం అనేక సేవలు అందించినట్లు ఆయన చెప్పారు. నామినేటెడ్ పదవులు ఇచ్చి తగిన న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామానికి చెందిన పుప్పాల భాగ్యవ్వ అనారోగ్యంతో మృతి చెందారు. తాజా మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరు చనిపోయిన తనవంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మృతురాలి కుటుంబ సభ్యులను ఎంపీటీసీ నందన బోయిన నర్సింలు పరామర్శించారు

బీరప్ప ఆలయంలో జెడ్పీటీసీ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామంలో బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం పెద్ద పండుగ సందర్భంగా మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, కొమరవెల్లి దేవస్థానం చైర్మన్ లక్ష్మారెడ్డి, చేర్యాల, కొమురవెల్లి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్ము రవి, మహదేవుని శ్రీనివాస్‌లతో కలిసి బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి బీరప్ప కామరాతిల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివయ్య గౌడ్, గోపి, లింగాపూర్ తాజా మాజీ ఉపసర్పంచ్ జెల్లా స్వరూప శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు అశోక్ కుమార్, సీనియర్ నాయకులు కొలిపాక భూపతి, బాలమల్లు, వెంకటయ్య, మల్లేశం, కురుమ సంఘం పెద్దలు, పాల్గొన్నారు

మోటార్ సైకిల్ చోరీ చేసిన నిందితుని అరెస్ట్



నవతెలంగాణ-కొండపాక

మోటార్ సైకిల్‌ని దొంగిలించిన నిందితుడిని కుకునూరు పల్లి పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. కుకునూర్ పల్లి మండలం మంగోల్ ఎక్స్ రోడ్ వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చిన వ్యక్తిని పట్టుకొని ప్రశ్నించగా వివరాలు బయటపడ్డాయని తెలిపారు. దుబ్బాక మండలం పద్మనాభుని పల్లి గ్రామానికి చెందిన కండ్లకోయ మురళిని అరెస్టు చేసినట్టు తెలిపాడు. కుకునూరు పల్లి లో మహమ్మద్ లైయిక్ పాష ఈనెల 23న తన మోటార్ సైకిల్ ను మసీదు ముందు పార్క్ చేశాడు. అప్పటినుంచి కనబడకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దాంతోపోలీసులు పరిశోధన ప్రారంభించారు మంగళవారం తనిఖీ చేస్తుండగా నిందితుడు పట్టుపడి చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు.

వెంకట్రాం రెడ్డికి నిర్వాసితుల ఉసురు తగులుతుంది



నవతెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితుల ఉసురు తగులుతుందని పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి అన్నారు. మంగళవారం ప్రజ్ఞాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న నల్ల పోచమ్మ దేవాలయం, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ భూ నిర్వాసితులను నట్టేట ముంచిన వెంకట్రామ్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ టికెట్ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో వెంకట్రాంరెడ్డి సిద్దిపేట జిల్లాలో అక్రమాలకు పాల్పడ్డాడని, ఆయనకు దమ్ముంటే మల్లన్న సాగర్ ముంపు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తుందని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నేత నాగరాజు, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు శివులు, మైనార్టీ నాయకులు అజ్గర్ జానీ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండు లక్ష్మణ్, ముత్రాజ్ పల్లి ఆంజనేయులు యాదవ్, శ్రావణ్, బిక్షపతి, సాయి, రాములు, నర్సింలు, దత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట విషాదం

- చేపల వేటకు వెళ్ళి వ్యక్తి మృతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

అక్బురుపేట భూంపల్లి మండలం కూడవెల్లి గ్రామానికి చెందిన రైతు ఎనగంటి దుబ్బయ్య(48) చెక్ డ్యామ్ వద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామేశ్వరం పల్లి చెక్ డ్యామ్‌లో చేపల వేట కోసం కరెంట్ షాక్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. చెక్ డ్యామ్ వద్ద అతని మృతదేహాన్ని గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్బురుపేట భూంపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పండగ పూట విషాదం జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.